అధికార పాపం.. రైతన్నకు శాపం

- తెరుచుకోని కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- అందుబాటులో లేని గోతాలు
- షెడ్యూల్ అయిన తర్వాతే గోతాలు
- కల్లాల్లోనే మిల్లర్లకు ధాన్యం అమ్మేందుకు రైతుల ఆసక్తి
- సాక్షి విజిట్‌లో వెలుగు చూసిన వాస్తవాలు



ఇది మనుబోలులోని ధాన్యం కొనుగోలు కేంద్రం. గురువారం ఉదయం 11 గంటలకు తెరుచుకోలేదు. రైతులెవరూ కేంద్రం వద్దకు రాకున్నా సిబ్బంది అందుబాటులో ఉండాలి. కేంద్రాలైతే ఏర్పాటు చేశారు గానీ అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో కొన్నిచోట్ల అవి తెరుచుకోవడం లేదు.



కల్లాంలోనే ధాన్యాన్ని కొలుస్తున్న మిల్లర్లు

కూటమి ప్రభుత్వ తీరు కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు కొనుగోలు కేంద్రాలు పెట్టినా వాటితో ఎటువంటి ఉపయోగం లేకుండా ఉంది. సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. రవాణా చార్జీలు వస్తాయో.. రావోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు ఉన్నాయని వాపోతున్నారు. దీంతో కల్లాల్లోనే మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తున్నారు.

సాక్షి విజిట్

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రభుత్వం 68 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. వరికోతలు ఇప్పటికే ప్రారంభమై చాలామంది రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. కేంద్రాల ద్వారా అమ్ముకునేందుకు అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. తేమ శాతం, గోతాల సమస్య, సిబ్బంది కొరత, ఇంకా కొన్ని గ్రామాల్లో కోతలు మొదలు కాకపోవడం తదితర కారణాలతో రైతులు కేంద్రాలకు రావడం లేదు. గురువారం సాక్షి బృందం క్షేత్రస్థాయిలో విజిట్ చేయగా అనేక విషయాలు వెలుగు చూశాయి.

మండలాల్లో ఇలా..

ముత్తుకూరు, మనుబోలు మండలాల్లో ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కేంద్రాల ద్వారా రైతులు అమ్ముకోలేదు. అయితే ఈ మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమైనట్టు తెలుస్తోంది. వెంకటాచలం మండలంలో కేవలం 28 మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కేంద్రాల ద్వారా రైతులు విక్రయించారు. పొదలకూరు మండలంలో 308 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తాటిపర్తి, నేదురుమల్లి కొనుగోలు కేంద్రాల ద్వారా షెడ్యూలింగ్ చేయించుకుని రైతులు అమ్ముకున్నట్టు అధికారులు తెలిపారు. తోటపల్లిగూడూరు మండలంలో ఇప్పటి వరకు 25 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలనుకునే రైతులు కోతలకు వారం రోజుల ముందే దగ్గరలోని కేంద్రాలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కోతలైన తర్వాత కేంద్రంలో షెడ్యూలింగ్ చేయించుకుంటేనే గోతాలు మిల్లర్ల నుంచి అందుతాయి.

గోతాలేవీ..?



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

కోవూరు: మండలంలోని పాటూరులో ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. దీంతో విధిలేక దళారులకు విక్రయించాల్సి వస్తోంది. అన్నదాతల అగచాట్లను పరిశీలించేందుకు గానూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి గురువారం ఉదయం 10.20కు వెళ్లిన సాక్షి బృందానికి ఇవి కంటపడ్డాయి. మండలంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటి ద్వారా ఇప్పటి వరకు 805.08 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. కొన్ని గ్రామాల్లో గోతాలు నేటికీ సరఫరా కాలేదు. ఆరు వేలు అవసరం కాగా, ఇప్పటికి వెయ్యి గోతాలే అందుబాటులో ఉన్నాయి.

గింజ కొంటే ఒట్టు..!



మైపాడులో వెలవెలబోతున్న కేంద్రం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇందుకూరుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ పరిధిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడి కేంద్రంలో గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. వరి కోతలు మాత్రం ముమ్మరంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలపై నమ్మకం లేక దళారులనే రైతులు ఆశ్రయిస్తున్నారు. కాగా నిడిముసలి పీఏసీఎస్ పరిధిలోని నిడిముసలి, ముదివర్తిపాళెం తదితర గ్రామాలకు సంబంధించి 70 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటి వరకు కొనుగోలు చేశారు.

గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నాం



ధాన్యానికి గత ప్రభుత్వ హయాంలో మంచి గిట్టుబాటు ధర ఉండేది. ఆ సమయంలో రూ.24 వేల వరకు విక్రయించాం. అయితే ప్రస్తుతం గిట్టుబాటు లేక రూ.17 వేలకే విక్రయించాల్సి వస్తోంది. కోవూరులో ఆరు మిల్లులుండగా, బ్యాంక్ గ్యారెంటీ లేదు. అనుమతొచ్చేంత వరకు ఆగమంటున్నారు. ధాన్యాన్ని తీసుకొని నెల్లూరులోని మిల్లుకు వెళ్లాలని సలహా ఇస్తున్నారు.

– వెంకటేశ్వర్లు, పాటూరు, కోవూరు

గత్యంతరం లేక..



ఎన్నో కష్టాలు పడి పంటలను సాగు చేశాం. సరైన గిట్టుబాటు ధరల్లేవు. ఇది వచ్చినా, రాకపోయినా భూయజమానికి లీజు డబ్బులు చెల్లించాల్సిందే. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– గండవరపు సుబ్రహ్మణ్యం, పాటూరు

అంతా కంటితుడుపే..



వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్

బుచ్చిరెడ్డిపాళెం: బ్యాంక్ గ్యారెంటీలను మిల్లర్లు సమర్పించకపోవడంతో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు బుచ్చిరెడ్డిపాళెంలో ఎవరూ ముందుకురావడంలేదు. ఇక్కడి ధాన్యాన్ని నెల్లూరు, కోవూరు మిల్లర్లకు సరఫరా చేసేలా కంటితుడుపు చర్యలు చేపట్టారు. ప్రైవేట్ వ్యక్తులే అధిక ధరలను ఇస్తుండటంతో రైతులు సైతం వీరికే విక్రయిస్తున్నారు. మండలంలో వవ్వేరు కోఆపరేటివ్ సహకార సంఘం, బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగు సహకార సంఘాలు పెద్దవిగా ఉన్నాయి.

వీరు సచివాలయాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టారు. మరోవైపు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి సరఫరా చేసి తద్వారా వచ్చే మొత్తాన్ని స్వాహా చేసే ప్రక్రియలో కొందరు నేతలు తలమునకలై ఉన్నారని సమాచారం.

ఎన్నో ఆంక్షలు



ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల ఉపయోగం లేదు. అక్కడి ఉన్న నిబంధనలు, ఆంక్షలతో వెళ్లలేకపోతున్నాం. ఆరబెట్టుకుని కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలంటే రైతులకు అలాంటి సౌకర్యాలు ఎక్కడున్నాయి?. సకాలంలో నగదు వస్తుందనే నమ్మకం కూడా లేదు.

– దేగా శ్రీనివాసులు, రైతు, తాటిపర్తిపాళెం, వెంకటాచలం మండలం

రవాణా చార్జీలు రైతులే భరించాలి



ధాన్యం తరలించేందుకు ముందుగా రవాణా చార్జీలను రైతులే భరించాలి. తర్వాత అవి వస్తాయో రావో తెలియని పరిస్థితి. నెమ్ము శాతంపై విధించిన నిబంధనల వల్ల కూడా ఇబ్బందిగా ఉంది. బయటి వారికి అమ్ముకుంటే మద్దతు ధర లభించకున్నా సమస్యలుండవు.

– మన్యం చిరంజీవిగౌడ్, రైతు, తోటపల్లిగూడూరు


దురుసుగా వ్యవహరిస్తున్నారు



ముత్తుకూరులోని ధాన్యం కొనగోలు కేంద్రంలో సిబ్బంది రైతుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారు. బాధ్యతగా వ్యవహరించడం లేదు. ధాన్యం కొనుగోలులో విధించిన ఆంక్షలు, సాంకేతిక లోపాలు చూసిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించకూడదని నిర్ణయించుకున్నాం.

– పరమేశ్వర్‌రెడ్డి, పాటూరువారికండ్రిగ, ముత్తుకూరు మండలం

కల్లాల్లోనే అమ్ముకుంటున్నాం



ధాన్యాన్ని కల్లాల్లోనే అమ్ముకుంటున్నాం. మద్దతు ధర లభించకపోయినా రైతులకు సమస్యలు పెద్దగా ఉండవనే అభిప్రాయం వల్ల నేరుగా మిల్లర్లకు విక్రయిస్తున్నాం. సవాలక్ష నిబంధనల వల్ల కొనుగోలు కేంద్రాలకు రైతులు వెళ్లలేకపోతున్నారు.

– పి.పెంచల నారాయణరెడ్డి, రైతు, మొగళ్లూరు, పొదలకూరు మండలం

పొంతన లేదు



కొనుగోలు కేంద్రాలపై అధికారులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న దానికి పొంతన ఉండటం లేదు. 17 శాతం తేమ ఉండేలా రైతులు ఆరబెట్టడం వీలు కాదు. రవాణా చార్జీలు రైతులు ముందుగా భరిస్తే తర్వాత చెల్లిస్తామంటున్నారు.

– దండు సుబ్బారెడ్డి, రైతు, మనుబోలు

వాహనాల్లేక ఇబ్బంది



ధాన్యాన్ని మిల్లుకు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉండాలి. అయితే ఇవి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంక్ గ్యారెంటీల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జీపీఎస్ వాహనాల సంఖ్యను పెంచాలి

– కోటయ్య, పాటూరు, కోవూరు

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు



ముత్తుకూరు: ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే పదో పరీక్షలకు సంబంధించి గురువారం ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ముత్తుకూరులోని జెడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాల, వీబీఆర్ హైస్కూల్, పిడతాపోలూరులోని రత్నం హైస్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించారు. 724 మంది విద్యార్థులు హాజరవుతారని అధికారులు వెల్లడించారు.

పుస్తకావిష్కరణ



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో పుస్తకాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్, ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. ఫార్మకాలజీ ఫార్మకోగ్నోసి ప్రిన్సిపల్స్ అండ్ ప్రాక్టీస్ అనే పుస్తకాన్ని ప్రిన్సిపల్ మాధవీలత, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, అసోసియేట్ ప్రొఫెసర్ రమాదేవి రచించారు.

పిల్లల స్థితిగతులను తెలియజేయాలి

ఇందుకూరుపేట: గృహ సందర్శనలను అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టి పిల్లల స్థితిగతులను తల్లిదండ్రులకు తెలియజేయాలని సీడీపీఓ రాజేశ్వరి కోరారు. పోషణ్ భీ.. పఢాయి భీపై నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల ప్రతిభను అసైన్‌మెంట్ కార్డు ద్వారా తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. సూపర్‌వైజర్లు లలితాంబ, మంజుల పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదు

కోవూరు: ప్రజా మనిషి వీరి చలపతిరావుపై రౌడీషీటర్ గరికపాటి రాజా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సుబ్బరాయుడు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. మరోసారి ఇలా మాట్లాడితే ఊరుకోబోమన్నారు. శ్రీధర్, ఉదయభాస్కర్, మోషే, జాషువా, వంశీ, పెంచలయ్య, అవినాష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల క్షేత్ర సందర్శన



వరిని పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు: మండలంలోని డేగపూడి గ్రామంలో మేలైన వరి సాగు పద్ధతులను పరిశీలించేందుకు గురువారం వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేశారు. ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికెట్ ఏజెన్సీ ఎక్స్‌టర్నల్ ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకట సునీల్‌రెడ్డితో కలిసి ఏడీఏ కె.శివనాయక్, ఏఓ వాసు వరిపైర్లను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంట నూర్పిడి పనులు చేస్తున్న వారిని కలిసి ధాన్యంలో పురుగు మందుల అవశేషాల ని ర్ధారణ కోసం శాంపిళ్లను సేకరించారు. నివేదిక వచ్చిన తర్వాత సంబంధిత రైతులకు స్కోప్ సర్టిఫికెట్లను అందజేస్తామని వెల్లడించారు. సర్టిఫికెట్ అందితే ఎఫ్‌పీఓ ద్వారా ధాన్యానికి మంచి ధరలు లభించే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు



వ్యవసాయాధికారులతో చర్చిస్తున్న పీడీ

ముత్తుకూరు: మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లను సమీక్షిస్తున్నామని డ్వామా పీడీ గంగాభవానీ అన్నారు. ముత్తుకూరులోని కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి, ఎంపీడీఓ నాగమణి, సొసైటీ సీఈఓ వెంకటాద్రితో సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలు, ట్రాక్టర్లు సమకూరుస్తున్నామన్నారు. కోతలు పూర్తయిన వెంటనే ధాన్యం తరలించేందుకు మిల్లర్లతో కూడా చర్చించామన్నారు. తరలించిన రెండు రోజులకే రైతులకు మద్దతు ధర అందజేస్తున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు

మనుబోలు: అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా గృహ నిర్మాణ శాఖ డీఈ జహీరుద్దీన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. 2017 నుంచి 2025 వరకూ వివిధ పథకం కింద ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జలజాక్షి, హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శరత్, శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని చైర్‌పర్సన్ సుప్రజ పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. పట్టణంలో తాగునీటి సరఫరా వేళలను మార్చనున్నామని ప్రకటించారు. ఉదయం ఐదు నుంచి ఎనిమిది వరకు.. సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది వరకు సరఫరా ఉంటుందన్నారు. వ్యర్థాలను చెత్త కుండీల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయొద్దు



మాట్లాడుతున్న వంశీకృష్ణ

కొడవలూరు: ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే దళారులపై చర్యలు చేపడతామని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ హెచ్చరించారు. కొడవలూరు, నార్తురాజుపాళెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రేడ్ – ఏ ధాన్యం పుట్టికి రూ.19,720ను మద్దతు ధరగా నిర్ణయించారన్నారు. బ్యాంక్ గ్యారెంటీ ఉన్న రెండు రైస్‌మిల్లులను కొడవలూరు మండలానికి కేటాయించామని వెల్లడించారు. ఏఓ లక్ష్మి, ఆర్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, నేత తువ్వర ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు



కొడవలూరు: పోషణ్ భీ.. పఢాయి భీపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కొడవలూరులోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసి ప్రీ స్కూల్ పిల్లలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సూచించారు.

విశేష పూజలు రేపు

కొడవలూరు: స్థానిక శ్రీధరస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు విశేష పూజలను హరిహర పుత్ర మణికంఠ సేవా సమాజ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని గురుస్వాములు కొప్పోలు నాగేశ్వరరావు, మన్నెం సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసానికి ఆత్మరక్ష ప్రశిక్షణ్



బుచ్చిరెడ్డిపాళెం: బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆపద ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలో తెలియజేసేందుకు గానూ రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమానికి రూపకల్పన చేశారని శిక్షకులు మన్మథ, శ్రీనివాస్, శ్యామ్ పేర్కొన్నారు. దీనిపై పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, బ్రహ్మరెడ్డి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూలింగ్‌కు వాట్సాప్ నంబర్



మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

కొడవలూరు: కొనుగోలు కేంద్రాల్లో షెడ్యూలింగ్ కోసం నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండవరంలో గల కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల కోసం పౌరసరఫరాల శాఖ 73373 59375 వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకునే ముందుగా ఈ నంబర్‌కు హాయ్ అనే సందేశం పంపితే షెడ్యూలింగ్ మెసేజ్ వస్తుందని తెలిపారు. పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఓ లక్ష్మి, వీఏఏ కవిత, బచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రారంభం

స్వచ్ఛభారత్ ద్వారా మండలంలోని గండవరం పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైంది. దీన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజకుమారి మాట్లాడారు. ట్రాక్టర్ సదుపాయం లభించడంతో గ్రామంలోని చెత్తాచెదారాలను డంపింగ్ యార్డుకు సులువుగా తరలించి పరిశుభ్రంగా ఉంచుకునే వెసులుబాటు కలిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, జూనియర్ సహాయకుడు రవిచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశాన్ని నిర్వహిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.1.8 లక్షలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఇళ్లు పూర్తికాకుండా ఏ దశలో ఉన్నా ఎస్సీలు, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను అందజేయనుందని పేర్కొన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం ఉదయం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు 43 మందికి గానూ 36 మంది హాజరై ఏడుగురు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,217 మందికి గానూ 7,717 మంది హాజరై 500 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఐదుగురిని డిబార్ చేశారన్నారు.

ధాన్యం విక్రయాల్లో అన్నదాతల ఇబ్బంది

కోవూరు: ధాన్యాన్ని విక్రయించడంలో అన్నదాతలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య పేర్కొన్నారు. పాటూరులో గురువారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. పడుగుపాడు సొసైటీ, నాబార్డు నిధులతో నిర్మించిన గోదాములో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాల్లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి కల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు. నేతలు వవ్వేటి మల్లికార్జున్‌రెడ్డి, పూనమల్లి జానకిరామ్, అఫ్రోజ్, గండవరపు విజయ్‌కుమార్, ఊటుకూరు వెంకటరమణయ్య, నెల్లూరు మణి, సురేష్ యస్దానీ, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.